క్లుప్తంగా

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్

ధర్మవరం అర్బన్: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు సూర్య పాఠశాల విద్యార్థులు మెహరున్నీసా, లోకేష్‌ను ఎంపికయ్యారని కరస్పాండెంట్ నరేంద్రబాబు తెలిపారు. స్థానిక పాఠశాలలో సోమవారం ఆ విద్యార్థులను కరస్పాండెంట్ అభినందించారు. ఆదివారం జరిగిన జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ జట్ల ఎంపికలో ప్రతిభ కనబరిచి తమ పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి జట్టులో స్థానం సాధించారన్నారు.

గ్రామ కమిటీ ఎంపిక

రామగిరి: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని పార్టీ మండల కన్వీనర్ మీసుగ నాగరాజు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పెద్దకొండాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు అయినప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటరెడ్డి, రామ్మూర్తి, సూరి, ప్రభాకర్ రెడ్డి, అక్కులప్ప, చాకలి రాము, నరసింహ, శ్రీనివాసులు, నాగేష్, జయశంకర్ రెడ్డి, నర్శిరెడ్డి పాల్గొన్నారు.

కృష్ణా జలాలతో చెరువులను నింపుతాం

పుట్టపర్తి: నియోజకవర్గంలోని 193 చెరువులను కృష్ణా జలాలతో నింపడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి తెలిపారు. సోమవారం బుక్కపట్నం సమీపంలోని జానకంపల్లి వద్ద హంద్రీ–నీవా కాలువ లైనింగ్ పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, జనసేన పుట్టపర్తి నియోజకవర్గ అధ్యక్షుడు పత్తి చంద్రశేఖర్, టీడీపీ నేతలు సామకోటి ఆదినారాయణ, మల్లిరెడ్డి ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

డబ్బుల విషయంలో వ్యక్తిపై దాడి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శారదానగర్ దుర్గా దాబాలో డబ్బుల విషయంలో ఆదివారం రాత్రి ఓ వ్యక్తిపై దాడి జరిగింది. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. మార్కెట్‌యార్డు సమీపంలో నివసించే చింత మధుసూదన్‌నాయుడు ఎరగుంటకు చెందిన రాజాకు డబ్బుల విషయంలో వాదోపవాదాలు జరిగాయి. రాజా, అతని స్నేహితులు మధుసూదన్‌నాయుడుపై దాడి చేశారు. ఈ దాడిలో అతని తలకు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు రాజాతోపాటు మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు.

పల్లె రఘునాథ రెడ్డిపై బీజేపీ నేత ఫిర్యాదు

పుట్టపర్తి టౌన్: మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిపై మంత్రి సత్యకుమార్ సన్నిహితుడు, ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తన భూమిలోకి మాజీ మంత్రి పల్లె మనుషులను పంపి గొడవ చేస్తున్నారని తెలిపారు. భూమి కాపాడుకునేందుకు ప్రయత్నించిన వారిపై కియా పోలీసులు కేసు నమోదు చేయడం సబబు కాదన్నారు. 2015లో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఆ భూమితో పల్లెకు ఎలాంటి సంబంధం లేదన్నాడు. సంబంధం లేని మంత్రి సత్యకుమార్‌ను ఈ వివాదంలోకి లాగడం సరికాదన్నారు. మాజీ మంత్రిపల్లె రఘునాథరెడ్డి తనకు డబ్బులు ఇవ్వకుండా చెక్కులు ఇచ్చారని.. అవి కూడా బౌన్స్ అయినట్లు తెలిపాడు. ఎస్పీ అందుబాటులో లేకపోవడంతో ఎస్‌బీ సీఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

హత్యాయత్నం కేసు నమోదు

బత్తలపల్లి: మండలంలోని గుమ్మల్లకుంటకు చెందిన నరేంద్రపై హత్యాయత్నం కేసులో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు స్థానిక పోలీసులు సోమవారం తెలిపారు. వివరాలు..గుమ్మల్లకుంటకు చెందిన నరేంద్ర, కోడేకండ్లకు చెందిన నారాయణస్వామి ఇద్దరూ శుభకార్యాలకు డ్రమ్స్ కొట్టేవారు. ఇద్దరి మధ్య కొన్నాళ్ల నుంచి మనస్పర్థలు వచ్చాయి. నారాయణస్వామికి తెలియకుండా నరేంద్ర ముదిగుబ్బకు డ్రమ్స్ కొట్టేందుకు వెళ్లేవాడు. దీంతో నారాయణస్వామి ఆగ్రహించి తన స్నేహితుడు గరిశలపల్లి సందీప్‌తో కలిసి మద్యం సేవించి ముదిగుబ్బ నుంచి తిరిగి వస్తున్న నరేంద్రపై ఉప్పర్లపల్లి వద్ద కాపుకాసి కొడవలితో హత్యాయత్నం చేశాడు.

పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కదిరి అర్బన్: నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న సెయింట్ థామస్ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ కోరారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో జేసీ అభిషేక్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఒత్తిడి జయించు.. విజయం సాధించు!

- సమతుల ఆహారంతో మెదడుకు చురుకుదనం
- రానున్న పరీక్షలకు సన్నద్ధం ఇలా..

ధర్మవరం అర్బన్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఒత్తిడిని జయిస్తేనే చదువుపై శ్రద్ధ ఉంటుంది.. పరీక్షల్లోనూ విజయం సాధ్యమవుతుంది.. పరీక్షలు దగ్గర పడేకొద్దీ బాగా చదవాలని, అత్యధిక మార్కులు సాధించాలని తినడం, నిద్రపోవడం మాని పుస్తకాలకే పరిమితమవుతున్నారు.. సమతుల ఆహారం తీసుకుంటే మెదడుకు చురుకుదనం వస్తుందని, పరీక్షలు ప్రశాంతంగా రాయగలరని వైద్యులు, విద్యారంగ నిపుణులు చెప్పున్నారు. ప్రస్తుతం జరగబోవు పదోతరగతి, ఇంటర్, డిగ్రీ విద్యార్థులు పరీక్షల సమయంలో ఎలాంటి ఆహారం తీసుకోవాలి.. ఏ జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేస్తున్నారు.

నిద్ర : రోజూ ఆరు గంటలు నిద్ర ఉండేలా చూసుకోవాలి. రాత్రంతా నిద్ర పోకుండా చదివినా గుర్తుండవు. ఒక గంటలో 45 నిమిషాలు చదివితే 15 నిమిషాలు విశ్రాంతి తీసుకోవాలి. నిరంతరాయం చదివితే మెదడు గ్రహించే శక్తి కోల్పోతుంది. పరీక్షల్లో గుర్తుండవు. పరీక్షలంటూ కంగారు పడకుండా ఉన్న సబ్జెక్టులనే మరోసారి చదువుతూ ఉండాలి. కొత్త సిలబస్‌ను చదివేందుకు ప్రయత్నించాలి.

జబ్బులు: నూనెతో చేసిన ఆహారం తీసుకోవడం వల్ల వాంతులు, విరేచనాలవుతాయి. మాంసకృత్తులు తినకుండా జాగ్రత్తలు పాటించాలి. బజారులోని చిరుతిండ్లు, మసాలా ఆహారం మానేయాలి. వేపుళ్లు తినకూడదు. కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్లు, గ్లూకోజ్ ఉండే పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు తీసుకోవాలి. ఇళ్లలో లభించే రొట్టెలు, చపాతీలు, జొన్న రొట్టెలతోపాటు ఆకుకూరలు తీసుకోవాలి. దోమలులేని ఆహ్లాదకర వాతావరణంలో చదవాలి.

ఆహారం



విద్యార్థులు పరీక్షలు దగ్గర పడ్డాయన్న తపనతో బాగా చదవాలని సమయానికి ఆహారం తీసుకోరు. దీంతో రక్త ప్రసరణ తగ్గి మెదడుకు గ్లూకోజ్ చేరకపోవడంతో నెమ్మదిగా జ్ఞాపకశక్తి తగ్గుతుంది. తేలికగా జీర్ణమయ్యే ఆహారం తినాలి. ఉడకబెట్టిన కాయగూరలు, పాలు, గుడ్లు, ఆకుకూరలు, పోషక పదార్థాలున్న ఆహారం తీసుకోవాలి. మాంసకృత్తులకు దూరంగా ఉండాలి. రోజులో ఒకేసారి అధిక ఆహారం తిన్నా మెదడు నిద్రావస్థకు వెళ్తుంది. సమయానికి ఆహారం తీసుకుంటే ఎసిడిటీ రాదు.

నీరు



చదువుకునే సమయంలో గంట గంటకూ గ్లాసు నీరు తాగాలి. రోజుకు 5 లేదా 6 లీటర్ల నీరు తాగాలి. కాఫీ, టీలు మానేయాలి. వాటి వల్ల ఉత్తేజం వచ్చినా క్రమేపీ మెదడు పని తీరు మందగిస్తుంది. చదువుకునే ప్రాంతంలో నీళ్ల బాటిల్ దగ్గరలోనే ఉంచుకోవాలి. నీటిని తాగితే శరీరంలో తేమశాతం తగ్గదు.

వెలుతురు అవసరం



రాత్రిళ్లు వెలుతురులో చదువుకోవాలి. లేకపోతే కళ్లపై ఒత్తిడి పెరిగి తలనొప్పి వస్తుంది. దీంతో రోజంతా చదువుకు స్వస్తి చెప్పాల్సి వస్తుంది. చదువుకునే సమయంలో పుస్తకంపై వెలుతురు పడేలా చూసుకోవాలి. పుస్తకంలో అక్షరాలు సరిగా కనిపించకపోతే లైటు దగ్గరకు వెళ్లి చదువుకోవాలి. పగలు అయితే గదిలో కిటికీలు తెరచి ఉంచాలి. అప్పుడే ఆక్సిజన్ బాగా అంది మెదడుకు గ్రహణశక్తి పెరుగుతుంది.



పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థినులు

పరీక్ష రోజు



పరీక్షకు రెండు గంటల ముందు చదవడం ఆపేయాలి. కొత్త పుస్తకాలు, కొత్త సబ్జెక్టులు చదవకూడదు. నూనె వస్తువులు, కారంతో ఉన్న మసాలా ఆహారాన్ని తీసుకోకూడదు. పరీక్షకు వెళ్లే సమయంలో ఆహారం మితంగా తీసుకోవాలి. తినకుండా పరీక్షకు వెళ్తే మెదడుకు గ్లూకోజ్ అందక సమాధానాలు గుర్తుకు రావు.

ఇంటి వాతావరణం: తల్లిదండ్రులు పిల్లల ముందు గొడవ పడకూడదు. పరీక్షల సమయంలో ఇంటిల్లిపాది టీవీలు చూడటం, సెల్‌ఫోన్లలో మాట్లాడటం, కూర్చొని మాట్లాడడం మానేయాలి. నిరంతరం చదవాలంటూ పగలు, రాత్రి పిల్లలపై ఒత్తిడి పెంచరాదు. అవసరమైతే వారికి ఎలా చదివితే అర్థమవుతుందో వివరించాలి.

నీరసం: ఎక్కువ సమయం కూర్చొని చదివితే ఎండవేడిమితో నీరసం వస్తుంది. అలాంటి సమయంలో ఒక గ్లాసు మంచినీళ్లలో చిటికెడు ఉప్పు, చిటికెడు చక్కెర కలిపిన నీరు తాగాలి. కొబ్బరి నీళ్లు తీసుకున్నా పర్వాలేదు. కలింగర, కర్బూజ తదితర పండ్ల రసాలు తీసుకోవాలి.

ధ్యానం



రోజూ విద్యార్థులు అయిదు నిమిషాల పాటు ధ్యానం చేస్తే మేలు. శ్వాస, నిశ్వాసల వల్ల రక్త ప్రసరణ మెదడుకు చేరి గ్రహణశక్తి పెరుగుతుంది. ధ్యానంతోపాటు గ్రూపుగా కూర్చొని చర్చించడం వల్ల సమాధానాలు గుర్తుండిపోతాయి. చదివే సమయంలో పక్కన ఖాళీ కాగితంలో రాసుకుంటే మరోసారి రిపీట్ చేయడానికి వీలుంటుంది. టేబుల్ వేసుకొని చదివితే మంచి ఫలితాలుంటాయి.

ఒత్తిడికి గురికావద్దు



విద్యార్థులు పరీక్షలని గంటలకొద్దీ చదివి, ఆహారం, నిద్ర మానేస్తారు. దీంతో మెదడుపై ప్రభావం చూపుతుంది. గంటలో 15 నిమిషాలు చదవకుండా మెదడుకు విశ్రాంతి నివ్వాలి. పరీక్షల సమయంలో ఆహారం తీసుకోవడం వల్ల మెదడుకు గ్లూకోజ్ అందుతుంది. నూనెతో చేసిన ఆహారం, మాంసకృత్తులు తినడంవల్ల వాంతులు, విరేచనాలవుతాయి. మెదడు సరిగా పనిచేయదు. – డాక్టర్ మాధవి, సూపరింటెండెంట్, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, ధర్మవరం

టేబుల్ వేసుకుని చదవాలి



పరీక్షల సమయంలో సబ్జెక్టుల వారీగా టైమ్ టేబుల్ వేసుకోవాలి. లేకపోతే ఒత్తిడికి గురికావాల్సివస్తుంది. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను ఎప్పటికప్పుడు చదవాలి. గంటల కొద్దీ ఒకే సబ్జెక్టు చదవకుండా సబ్జెక్టులు మార్చాలి. అప్పుడే మెదడుకు పదును పెరుగుతుంది.

– రామకృష్ణనాయక్, బీఎస్‌ఆర్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు, ధర్మవరం

అంగన్‌వాడీల సమస్యలు తీర్చాలని ధర్నా



ఆర్డీఓ మహేష్‌కు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ వర్కర్లు

ధర్మవరం అర్బన్: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలు తీర్చాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు.సోమవారం పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలోనున్న ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు ధర్నా చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ మహేష్‌కు వినతిపత్రం అందించారు. సీఐటీయూ మండల కో కన్వీనర్ అయూబ్‌ఖాన్, సీనియర్ నాయకులు ఎస్‌హెచ్ బాషా, హైదర్‌వలి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ప్రాజెక్టు అధ్యక్షురాలు సరస్వతి మాట్లాడారు. నిరసనలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు పోతక్క, దీనా, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్: అంగన్‌వాడీ కార్యకర్తలకు వేతనాలు పెంచాలని కదిరి ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సీఐటీయూ నాయకులు సోమవారం ధర్నా చేపట్టారు. అనంతరం సీడీపీఓ రాధికకు పలు డిమాండ్లతో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాబున్నీషా, లక్ష్మిదేవి,నాయకులు బాబాజాన్, ముస్తక్ అలీఖాన్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం అంగన్‌వాడీ సిబ్బంది ధర్నా చేపట్టారు. రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల యూనియన్ లీడర్లు మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ లీడర్లు లక్ష్మీదేవి, రమణమ్మ, ప్రసన్న, చాముండి, కోమల, సరస్వతి, రామేశ్వరి అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

బత్తలపల్లి: తమ న్యాయమైన కోర్కెలు పరిష్కారం చేయాలని కోరుతూ సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రాజెక్టు ఆఫీసు వద్ద సోమవారం ధర్నా చేశారు. అనంతరం కార్యాలయం కోఆర్డినేటర్ ఓబులమ్మకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రమణ, నారాయణస్వామి, ప్రాజెక్టు లీడర్ వాసంతి, సెక్టార్ లీడర్లు రజిత, రజియా, భారతి, ప్రభావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వీరనారాయణ స్వామికి పూజలు

బత్తలపల్లి: మండలంలోని అప్పరాచెరువులో వీరనారాయణస్వామికి మూడు రోజుల ప్రత్యేక పూజల్లో భాగంగా సోమవారం స్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు నిర్వహించారు. అంతకు ముందు సమీపంలోని చిత్రావతి నదిలోకి ఉత్సవ విగ్రహాలను తీసుకెళ్లి, అక్కడ ప్రత్యేక అలంకరణలు చేశారు. ఆలయ అర్చకులు వీరనారప్ప వీరనారాయణస్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. సోమవారం రాత్రి గ్రామంలో గ్రామోత్సవం అనంతరం అన్నదానం చేశారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

ముదిగుబ్బ: మండలంలోని గుంజేపల్లి గ్రామ సమీపంలో ఉన్న కన్నెకలగొందిలో సోమవారం నుంచి విగ్రహ ప్రతిష్ట పూజలు ప్రారంభమయ్యాయి. బుధవారం వరకు విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభ, కుంభాభిషేక, ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ధర్మవరానికి చెందిన చౌటిపల్లి వేణుగోపాల్ కన్యకలగొందిలో నూతనంగా ఆలయాన్ని నిర్మించారు. సప్త శేష సుబ్రమణ్యేశ్వర దేవస్థానంలో హోమాలు, పూజలు నిర్వహించారు.

మాఘమాస ప్రత్యేక పూజలు



ముదిగుబ్బ: మండల కేంద్రంలోని పాతూరిలో వెలసిన సూర్యచంద్ర అభయాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం మాఘ మాసం పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు వేకువ జామునే మాఘస్నానాలను ఆచరించి, పూజల్లో పాల్గొన్నారు. స్వామిని తులసి పుష్పాలతో అలంకరించి నిత్యపూజ, ఆకుపూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు.

కాలభైరవస్వామికి ప్రత్యేక పూజలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీచక్రవర్తి థియేటర్ ఎదురుగానున్న స్వయంభు కాలభైరవస్వామి ఆలయంలో మాఘమాసం మూడో సోమవారం అభిషేకాలు, పూజలు, కంకణధారణ పూజలు నిర్వహించారు. ప్రదోష గడియల్లో ఆలయంలో పూజారి ధనుంజయ ఆచారి దోష నివారణ పూజలు చేశారు. ఉత్సవమూర్తికి అభిషేకాలు చేయించారు. దీపోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం కంకణాలను భక్తులకు అందించారు.

సంక్షిప్త సమాచారం

15 వినతులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 15 వినతులు అందినట్లు ఆర్డీఓ మహేష్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో రెండు వినతులు అందినట్లు కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు.

అనుమతులు లేని ప్లాట్లు కొనొద్దు

ముదిగుబ్బ: మేజర్ పంచాయతీ ముదిగుబ్బ పరిధిలో అనుమతులు లేని వెంచర్లలో ప్లాట్లు కొనడం, అమ్మడం నేరమని ఎంపీడీఓ దివాకర్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అలాంటి ప్లాట్లు కొంటే నిర్మాణాలకు అనుమతులు, డోర్ నంబర్లు కేటాయింపు ఉండవన్నారు. కార్యాలయం వద్ద హెచ్చరిక బోర్డులు, కరపత్రాలను పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి మంజులాదేవి తదితరులు పాల్గొన్నారు.

నాటు సారా స్వాధీనం

కదిరి అర్బన్: మండలంలోని చిగురుమానుతండాలో అక్రమంగా నాటు సారా నిల్వ ఉంచిన శ్రీనానాయక్ అనే వ్యక్తిని సోమవారం రూరల్ మండల పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి 20 లీటర్ల నాటు సారాను సీజ్ చేశారు. నిందితుడిని రిమాండ్ తరలించామని పోలీసులు తెలిపారు.

శ్రీశైలానికి పాదయాత్ర

ముదిగుబ్బ: ముదిగుబ్బ శ్రీ హరిహర దేవాలయం నుంచి సోమవారం శివమాలధారులు గంగరాజు, లక్ష్మన్న, వెంకటనారాయణలు శ్రీశైలానికి పాదయాత్రగా బయల్దేరారు. కార్యక్రమంలో రఘునాథశాస్త్రి, భరత్‌కుమార్ శాస్త్రి, గురుస్వామి సాకే గంగాధర్, రాజశేఖర్, వెంకటేష్, శివ భక్తులు పాల్గొన్నారు.

వెండి గొడుగుల బహూకరణ

ఓడీచెరువు: అల్లాపల్లి పంచాయతీ పరిధిలోని గౌనిపల్లి గ్రామం సోమావతి నది ఒడ్డున వెలసిన సామ్రాజుల కొండ అక్కమ్మ దేవతలకు గౌనిపల్లికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బాబు రూ.50 వేలు విలువైన వెండి గొడుగులు బహూకరించారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం

పుట్టపర్తి అర్బన్: బ్రాహ్మణపల్లిలోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల సంక్షేమ వసతి గృహం విద్యార్థినులకు ఎనుములపల్లి వైద్యాధికారిణి జ్యోత్స్న ఆధ్వర్యంలో సోమవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. సీహెచ్‌ఓ నగేస్, ప్రిన్సిపాల్ జమునాబాయి, శివజ్యోతి, వార్డెన్ రాధ పాల్గొన్నారు.

కంది పంటకు నిప్పు

ముదిగుబ్బ: మండలంలోని సిరిగారిపల్లి వద్ద రైతు నరసయ్య కంది పంటకు గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం నిప్పు పెట్టారు. బాధితుడు మాట్లాడుతూ 10 ఎకరాల్లో కంది పంట సాగు చేసినట్లు తెలిపాడు. ఆరు ఎకరాల్లోని పంట పూర్తిగా కాలిపోయిందన్నారు.

'విశిష్ట సంఖ్య'కు నమోదు చేసుకోవాలి

చెన్నేకొత్తపల్లి: భూమి ఉన్న రైతులు విశిష్ట సంఖ్య (యూనిక్ ఐడీ) కోసం రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఉదయ్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు ఇతర వ్యవసాయ సంబంధిత సేవలు పొందడానికి విశిష్ట సంఖ్య తప్పనిసరి అని పేర్కొన్నారు.

ఇంటింటికీ కెనరా బ్యాంకు సేవలు

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్ సిబ్బంది సోమవారం ఇంటింటికీ వెళ్లి కెనరా బ్యాంక్ సేవలపై వివరించారు. మహిళలకు ప్రత్యేక ఖాతాల ద్వారా కేన్సర్ తదితర అనారోగ్య సమస్యలకు వైద్య సేవలు అందుతాయన్నారు. కెనరా బ్యాంక్ పలు వినూత్న సేవలపై తెలియజేశారు. కార్యక్రమంలో రీజినల్ ఆఫీస్ సిబ్బంది రమేష్, డివిజనల్ మేనేజర్ లక్ష్మీనరసింహులు, మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి స్థలం కేటాయించండి

బత్తలపల్లి: భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఫాదర్ ఫెర్రర్ విభిన్న ప్రతిభావంతుల మండల సమాఖ్య సభ్యులు తహసీల్దార్ స్వర్ణలతను కోరారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. మండల సమాఖ్య అధ్యక్షులు వేణుగోపాల్, ఉపాధ్యక్షులు గడుపూటి జనార్దన్‌నాయుడు తదితరులు మాట్లాడారు.

చుక్కల భూముల సమస్యలు పరిష్కరించండి

ముదిగుబ్బ: మండలంలో చుక్కల భూముల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసనలో వారు మాట్లాడారు. సీపీఐ నాయకులు తిప్పయ్య, గంగిరెడ్డిపల్లి నాయుడు, తుమ్మల చిన్నప్ప, వెంకటరాముడు, రమేష్ పాల్గొన్నారు.

మోటార్ల కేబుల్ అపహరణ

ధర్మవరం రూరల్: బిల్వంపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మోటార్లకు అమర్చిన కేబుల్ వైరును ఎత్తుకెళ్లినట్లు రైతులు బాల ఓబిలేసు, నారాయణస్వామి, నర్సప్ప, బొజ్జన్న, రాజు, బాల్‌రెడ్డి, సురేంద్ర, కేశవ, బయన్నలు తెలిపారు. పంచాయితీ మోటార్‌కు ఉన్న కేబుల్‌ను కూడా ఎత్తుకెళ్లడంతో తాగునీటికి అవస్థలు పడాల్సి వస్తోందన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

కంటివైద్య శిబిరానికి స్పందన

తాడిమర్రి: స్థానిక ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటివైద్య శిబిరానికి స్పందన లభించింది. వైద్యాధికారులు హరిత, గోవర్దన్ నాయుడు సహకారంతో ధర్మవరం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం జరిగింది. ఆప్తాల్మిక్ అధికారి ఉరుకుందప్ప, భరత్ 120 మందికి కంటివైద్య పరీక్షలు చేశారు. 30 మందిని బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రికి బస్సులో తరలించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు జయసింహ, హెల్త్ సూపర్‌వైజర్ రామ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ నరేంద్రరెడ్డి, శివయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి

పుట్టపర్తి టౌన్: ఎన్నికలకు ముందు విద్యార్థులకు ఇచ్చిన హామీలను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే అమలు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శేషం మహేంద్ర, కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని గణేష్ కూడలిలో విద్యార్థులతో కలసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు నరసింహమూర్తి, సాయి గౌతమ్, పవన్, హరి, వినోద్, మహేష్ నాయక్, నితిన్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శిక్షణ

తాడిమర్రి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నుంచి ఆరు రోజుల పాటు అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంఈఓ కృష్ణమోహన్ ఓ ప్రకటనలో తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొన్న కారు

గాండ్లపెంట: గాజులవారిపల్లి సమీపంలోని కదిరి–రాయచోటి ప్రధాన రహదారిపై సోమవారం కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొంది. కదిరి నుంచి రాయచోటికి వెళ్లే సమయంలో గాజులవారిపల్లి వద్ద రోడ్డు మరమ్మతుల్లో భాగంగా కంకర వేయడంతో కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీ కొని పక్కనే ఉన్న ఇంటి ప్రహరీకి ఢీకొంది.

గేట్ల మరమ్మతులు పూర్తి చేయాలి

రామగిరి: అప్పర్ పెన్నార్ ప్రాజెక్ట్ (పేరూరు డ్యాం) గేట్ల మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పేరూరు డ్యాంలో ఆమె పర్యటించారు. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. గతంలో పేరూరు డ్యాం గేట్లు విరిగిపోవడంతో మరమ్మతులకు రూ.1.21 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వారం రోజులుగా గేట్ల తొలగింపు పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. తొలగించిన గేట్ల భాగాలను కర్నూలుకు తీసుకెళ్లి అక్కడ మరమ్మతు చేస్తారని తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ



వైష్ణవర్ధన్ రెడ్డి

అమడగూరు: గుండువారిపల్లికి చెందిన మధుసూదన్‌రెడ్డి కుమారుడు వైష్ణవర్ధన్ రెడ్డి ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్‌లో 61.78 శాతం మార్కులతో సత్తా చాటాడు. రైతు బిడ్డ జేఈఈ మెయిన్స్‌లో మంచి ఉత్తీర్ణత శాతాన్ని సాధించడంతో ఉపాధ్యాయులు, మండల వాసులు హర్షం వ్యక్తం చేశారు.

సర్వే పక్కాగా చేపట్టండి

కదిరి టౌన్: ఎన్‌సీడీ–సీడీ 3.0 సర్వే పక్కాగా చేపట్టాలని వైద్య సిబ్బందిని ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ నివేదిత ఆదేశించారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని రాజీవ్‌గాంధీ నగర్‌లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీని) ఆమె తనిఖీ చేశారు. డాక్టర్ లిఖిత్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు వీరనారమ్మ, ఎన్‌టీసీపీ శమంతకమణి, సీఓ వనజ, డీఈఓ కిరణ్, ఏఎన్ఎం, ఆశా వర్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఇంటర్వ్యూలు

పుట్టపర్తి అర్బన్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బీసీ, ఈబీసీ అభ్యర్థులకు ఈనెల 18, 19నఇంటర్వ్యూలు ఉంటాయని ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం పెడపల్లి ఏపీజీబీ పరిధిలోని పెడపల్లి, నిడిమామిడి, కొట్లపల్లి అభ్యర్థులకు వెంగళమ్మ చెరువు ఏపీజీబీ పరిధిలోని వెంగళమ్మ చెరువు, చెర్లోపల్లి అభ్యర్థులకు మధ్యాహ్నం 3 గంటలకు ఇంటర్వ్యూ ఉంటుందన్నారు.19న బ్రాహ్మణపల్లి ఎస్‌బీఐ పరిధిలోని అమగొండపాళ్యం, దిగువచెర్లోపల్లి, జగరాజుపల్లి అభ్యర్థులకు, బీడుపల్లి కెనరా బ్యాంకు పరిధిలోని బీడుపల్లి కప్పలబండ అభ్యర్థులకు మధ్యాహ్నం 3:30 గంటలకు ఇంటర్వ్యూలు ఉంటాయని వెల్లడించారు.

అమడగూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం, వైకేపీ కార్యాలయంలో ఈనెల 19న సబ్సిడీ రుణాల దరఖాస్తులను పరిశీలిస్తామని ఎంపీడీఓ మునెప్ప సోమవారం తెలిపారు. మండలానికి 24 బీసీ యూనిట్లు ఉన్నాయన్నారు.

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలో సబ్సిడీ రుణాల కొరకు దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులు ఈ నెల 19న ఉదయం 10.30 గంటలకు హాజరుకావాలని మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ సోమవారం తెలిపారు.

తనకల్లు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 18న ఏపీజీబీ పరిధిలో , 19న ఉదయం ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్ పరిధిలోఇంటర్వ్యూలు ఉంటాయని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రెడ్డెప్ప తెలిపారు.

గాండ్లపెంట: బీసీ రుణాల దరఖాస్తులను ఈ నెల 19న పరిశీలించనున్నట్లు ఎంపీడీఓ వెంకట్రామిరెడ్డి సోమవారం తెలిపారు. గాండ్లపెంట, రెక్కమాను ఏపీజీబీ, కదిరి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఏడీబీ) బ్యాంకు మేనేజర్లు హాజరవుతారన్నారు.

నివాళి



చెన్నమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి

అమడగూరు: మలకవారిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మాధవరెడ్డి తండ్రి తిప్పిరెడ్డి (65) ఆదివారం గుండెపోటుతో మరణించాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సోదరుడు దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి సోమవారం గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. తిప్పిరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ కవిత శివశంకర్‌రెడ్డి, కన్వీనర్ సూర్యనారాయణ రెడ్డి, సర్పంచ్ లక్ష్మీనరసమ్మ, రంగారెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, రవీంద్రరెడ్డి, రాఘవరెడ్డి, అమర, తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం కొత్తకోట సర్పంచ్ నాగమణి అత్త, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కొత్తకోట కేశప్ప మాతృమూర్తి, పార్టీ సీనియర్ నాయకురాలు చెన్నమ్మ (75) ఆదివారం రాత్రి మృతి చెందింది. సీనియర్ నాయకుడు దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కుండ్ల కిష్టయ్య, సర్పంచ్ గోవింద రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, ఎంపీటీసీ హర్షవర్దన్ రెడ్డి, రఘురామయ్య, సీలూరి ఈశ్వర్, రంగారెడ్డి పాల్గొన్నారు

నివాళి

ఓడీచెరువు: మండల పరిధిలోని శేషయ్యగారిపల్లికి చెందిన కదిరి మాధురి హోటల్ రాజారెడ్డి సతీమణి లక్ష్మీదేవి మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి సోదరుడు శ్రీనివాసరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. లక్ష్మీదేవి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, సర్పంచ్ శ్రావణి, వెంకటరమణ, ఎంపీటీసీ నాగప్ప, చింతమానుపల్లి సర్పంచ్ జగన్ మోహన్ చౌదరి, జయచంద్రా రెడ్డి, నల్లమాడ మాజీ సింగిల్ విండో ప్రెసిడెంట్ గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ



నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ముదిగుబ్బ: మండలంలోని పాయగట్టుపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రకాష్ తల్లి బాలమునెమ్మ అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సీపీ నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ భాస్కర్, నాయకులు రామిరెడ్డి తదితరులు మృతదేహానికి నివాళులర్పించారు.

ఎంఎల్‌టీ అసోసియేషన్ అధ్యక్షుడిగా సూర్యప్రకాష్‌రెడ్డి

ధర్మవరం అర్బన్: ప్రైవేట్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ధర్మవరానికి చెందిన శెట్టిపి సూర్యప్రకాష్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. పుట్టపర్తిలో సోమవారం ప్రైవేట్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. అందులో శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా శెట్టిపి సూర్యప్రకాష్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అసోసియేషన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ నవీన్, సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్లు సురేంద్రరెడ్డి, ప్రతాప్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, అనిల్, ఇమ్రాన్, అబ్దుల్లా, అంజి నూతన అధ్యక్షుడికి అభినందనలు తెలియజేశారు.